క్లుప్తంగా

9న మండల సమావేశం

పెనగలూరు : ఈనెల 9వ తేదీ (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు జరుగనుందని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. సమావేశం మండల అధ్యక్షురాలు అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రాయచోటి ఎంపీడీఓకు గాలివీడు ఇన్‌చార్జ్ బాధ్యతలు


సి.వెంకటేశ్

గాలివీడు : రాయచోటి ఎంపీడీఓ సి.వెంకటేష్‌కు గాలివీడు ఎంపీడీఓ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు.ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జవహర్ బాబు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో సోమవారం వెంకటేష్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రామాల్లో వేసవి దష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం, ఇతరత్రా సర్వేల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

ప్రవేశ పరీక్షపై అవగాహన


శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

రామాపురం : ఆదర్శ పాఠశాలలో ఈనెల 20న జరగబోయే 6వ తరగతి ప్రవేశ పరీక్షపై విద్యార్థులకు అవగాహనపై సోమవారం ఒక్క రోజు శిక్షణను నిర్వహించినట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష రోజు ఎలా రాయాలనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో అద్వైత విద్యార్థుల ప్రతిభ

గాలివీడు : జాతీయ ఒలంపియాడ్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారని అద్వైత గురుకులం ఫౌండర్, చైర్మన్ డా.ఇంద్రసేన తెలిపారు. ఐఎన్ టిఎస్‌ఓ(ఇండియన్ నేషనల్ సెర్చ్ ఒలంపియాడ్) పరీక్షల్లో వివిధ కేటగిరీలో స్టేట్ టాప్ 10లో 7 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించడం గర్వకారణం అన్నారు. మాథ్స్ ట్యాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో కె.షయాన్ స్టేట్ 2వ ర్యాంక్, పి.తరుణ్ 4వ ర్యాంక్, ఎస్.నవసంజన స్టేట్ 5వ ర్యాంక్, పి.తేజేష్ స్టేట్ 5వ ర్యాంక్, డి.శరత్ కుమార్ స్టేట్ 5వ ర్యాంక్ సాధించగా.. జీటీఎస్ఓ (జనరల్ నాలెడ్జ్ ట్యాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్)లో ఎస్.లిఖిత స్టేట్ 3వ ర్యాంక్ సాధించారు. అలాగే ఎస్టీఎస్ఓ(సైన్స్ ట్యాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్)లో ఎల్.కీర్తిరెడ్డి స్టేట్ 5 వ ర్యాంక్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు.

నూతన నియామకం



రామ్మోహన్ నరసింహులు

వీరబల్లి : బీఎస్పీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా పెద్దివీటి రామ్మోహన్‌ను, అన్నమయ్య జిల్లా సెక్రటరీగా పెద్దవీటి నరసింహులను నియమిస్తూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేసినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్ తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి జిల్లా కమిటీలో నిబద్ధతతో కృషి చేస్తామని వారు తెలిపారు. అలాగే బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున కృషి చేస్తామని పేర్కొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు

ఓబులవారిపల్లె : డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మైనర్లు వాహనాలు నడిపితే నడిపిన వ్యక్తితో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పి.మహేష్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు బతుకుదెరువు నిమిత్తం విదేశాలకు వెళ్లి ఇంటివద్ద మైనర్ పిల్లలకు ప్రేమతో వాహనాలు ఇవ్వడం జరుగుతుందని తద్వారా ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మైనర్లు వాహనాలు నడిపిన వారికి, వాహనం ఇచ్చిన యజమాని ఇద్దరిపై కేసు నమోదు చేస్తామన్నారు.

సరస్వతీ దేవిగా శ్రీరాముడు



రాజంపేట రూరల్ : నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహించుకుంటున్న శ్రీరామ నవమి వేడుకలు సోమవారం 2వ రోజుకు చేరుకున్నాయి. ఈ వేడుకలలో భాగంగా కనుల పండువగా దేవదేవేరుల కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. అదే విధంగా వేడుకగా గ్రామోత్సవాలు నిర్వహించుకున్నారు. శ్రీరామనవమి వేడుకలలో భాగంగా మండల పరిధిలోని భువనగిరిపల్లిలో 2వ రోజు సరస్వతీ దేవీగా సీతారాములను అలంకరించారు.

భద్రతేది.. సారూ!


సిద్దవటంలో బద్వేల్ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న బావి

సిద్దవటం : కడప – బద్వేల్ ప్రధాన రహదారిలోని సిద్దవటం పెట్రోల్ బంకు పక్కనే బావి ఉండటంతో వాహనదారులకు ప్రమాదం పొంచి వుంది. కడప నుంచి సిద్దవటం మీదుగా బద్వేల్ వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటాయి. ఇటీవల రాజదానికి సిద్దవటం మీదుగా వాహనాలు ప్రయాణిస్తుండటంతో వాహనాల సంఖ్య అధికమైందని, పగలు, రాత్రి వేళల్లో వాహనాలు క్రాసింగ్ అయ్యే సమయంలో వాహనాలు బావిలో పడే అవకాశం లేకపోలేదని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. అక్కడ భూమిలో కంపచెట్లు ఉండటంతో అక్కడ బావి ఉన్న విషయం ఎవరికీ తెలియకపోగా కంప చెట్లను పూర్తిగా తొలగించడంతో అక్కడ బావి ఉందనే విషయం తెలిసింది. ఇక్కడి బావిని పూడ్చకపోతే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి బావిని పూడ్చడమా, లేదా కంచె వేయడమా ఏదో ఒకటి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆక్రమణలో 'సంపద' కేంద్రం


ఆక్రమణకు గురైన టి.కమ్మపల్లి చెత్తనుండి సంపద కేంద్రం

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రం ఆక్రమణకు గురైంది. పక్కనే ఉన్న భూ యజమానులు ఆక్రమణకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు చెత్త నుంచి సంపద కేంద్రాలు ద్వారా వర్మీ కంపోస్టు చేయాలని ఆదేశాలు ఇచ్చినా వాటిని అమలు చేయడంలో పంచాయతీ అధికారులు, మండల అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధికారులు మండల వ్యాప్తంగా చెత్త నుంచి సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకువచ్చి తద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం


ఓబులవారిపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


సుండుపల్లి మండలం రాయవరం పీహెచ్‌సీలో..

ఓబులవారిపల్లె : కాన్పు సమయంలో తల్లీబిడ్డ మరణాలు నివారించడమే లక్ష్యమని వైద్యాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ముక్కావారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది మూడు లక్షల మాతృ మరణాలు, 20 లక్షల నవజాత శిశు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మానవాళికి మూల స్థంభాలైన తల్లీ, బిడ్డ ఆరోగ్యం కాపాడటమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు ద్వారా సాధ్యమైనంత వరకు తల్లీ బిడ్డల మరణాలను తగ్గించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి రూప, వెంకటసుబ్బయ్య, ఉషారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నమండెం, టి.చాకిబండ గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ రాధిక మాట్లాడుతూ 2025వ సంవత్సర నినాదం 'ఆరోగ్యకరమైన ప్రారంభం-ఆశాజనక భవిష్యత్'గా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రమాణం చేయించారు. అనంతరం ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సుండుపల్లి : వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పీహెచ్‌సీ డాక్టర్ శేఖర్‌రెడ్డి, రుబీనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన వయసులో వివాహం చేసుకోవాలని, స్త్రీలకు 21, పురుషులకు 24 సంవత్సరాల సమయంలో వివాహం చేసుకొని గర్భం దాల్చితే తల్లీ



చిన్నమండెం: టి.చాకిబండ పీహెచ్‌సీలో ప్రమాణం చేస్తున్న వైద్య సిబ్బంది

బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మంచి పోషకాలు ఉన్న పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రులలో పరీక్షలు చేయించుకుని కాన్పులు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, సూపర్‌వైజర్ ఎల్లమ్మ, నర్సులు అనూష, హేమ తదితరులు పాల్గొన్నారు.

దళిత రైతులకు న్యాయం చేస్తాం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నంపల్లి దళిత రైతులు

ఓబులవారిపల్లె : పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని చిన్నంపల్లి దళితవాడకు చెందిన రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన చిన్నంపల్లి దళితవాడ రైతులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వేనెంబరు. 2198, 2199లో ప్రభుత్వం సాగు చేసుకునేందుకు పట్టాలు ఇవ్వడం జరిగిందని, అయితే కొంతమంది అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకొని తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కబ్జాలను అరికట్టి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. స్పందించిన తహసీల్దార్ సంబంధిత సర్వే నెంబర్ల రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా గుర్తించామన్నారు. ఇందులో చిన్నంపల్లి దళితవాడకు చెందిన ఎనిమిది మంది రైతులకు పట్టాలు ఇచ్చినట్లు రికార్డులో ఉన్నాయని చెప్పారు. ఆన్‌లైన్ చేయించుకున్న వారికి నోటీసులు జారీ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి న్యాయం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, చిన్నంపల్లి దళితవాడ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను అక్కున చేర్చుకునేది వైఎస్సార్‌సీపీ

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


ఎమ్మెల్యే ఆకేపాటిని గజమాలతో సత్కరిస్తున్న అజంతమ్మ తదితరులు

రాజంపేట రూరల్ : పార్టీ అభివృద్ధికి పని చేసే ప్రతి కార్యకర్తను అక్కున చేర్చుకునేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా, నియోజకవర్గ స్థాయిలో నూతనంగా నియమించిన కమిటీలో పదవులు పొందిన వారు మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు సోమవారం విచ్చేశారు. తమకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్న ఆకేపాటితో పాటు ఆయన సోదరుడు, సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డిని సన్మానించి అభిమానం చాటుకున్నారు. అదే విధంగా గజమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానించిన వారిలో జిల్లా ఉపాధ్యక్షురాలు అజంతమ్మ, రాజంపేట మండల కార్యదర్శి బుర్రు సురేందర్‌యాదవ్, వాలంటీర్ వింగ్ అధ్యక్షులు బుర్రు శివయాదవ్, పట్టణ అధ్యక్షులు జెనుగు వెంకటకృష్ణారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మ, పట్టణ అంగన్‌వాడీ అధ్యక్షురాలు షీబా ఈస్టర్ తదితరులు ఉన్నారు.

భూ కబ్జాలు అడ్డుకోకపోతే పోరాటాలు


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టర్ భూ కబ్జాలను అడ్డుకోకపోతే భూ పోరాటాలు తప్పవని ఓబులవారిపల్లె సీపీఐ మండల సమితి తెలిపింది. సోమవారం సబ్‌కలెక్టర్ ఏఓకు సీపీఐ మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ ఆధ్వర్యంలో భూ సమస్యలపై వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి పి..మహేష్ మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలంలో భూ కబ్జాలు అధికమయ్యాయన్నారు. కబ్జాదారులు రెవెన్యూ యంత్రాంగాన్ని లెక్క చేయడంలేదన్నారు. బొమ్మవరంలో సర్వేనెంబరు 44లో ప్రభుత్వ భూమి 15 సెంట్లు మంగళపల్లెకు చెందిన సుబ్బరాయుడు నాయుడు ఏకంగా ప్రజలకు సంబంధించి బస్టాండును కబ్జా చేశారన్నారు. రాళ్లపల్లె పంచాయతీ, కొర్లకుంట పంచాయతీ, పెద్దఓరంపాడులో జరుగుతున్న భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతిచిన్నయ్య, రాజంపేట సీపీఐ పట్టణ కార్యదర్శి సికిందర్ తదితర భూ బాధితులు సీపీఐ కార్యకర్తల, నాయకులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం జిల్లా పరిశీలకుడు పెంచలయ్య పాఠ్య పుస్తకాలు, దుస్తులు, బెల్టు నిల్వ చేసే గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి సమస్య తలెత్తకుండా స్టాక్ పాయింట్ పకడ్బందీగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. పుల్లంపేట, ఓబులవారిపల్లి, పెనగలూరు, చిట్వేలి పాఠశాలల్లో స్టాక్ పాయింట్లను పరిశీలించడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు చక్రధర్ రాజు, నాగా తిరుమలరావు, కరుణాకర్, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నోడల్ నర్సరీ ఏర్పాటుకు విత్తనాల సేకరణ


సిద్దవటం రేంజ్‌లోని గొల్లపల్లె బీటు అటవీ ప్రాంతంతో విత్తనాలను సేకరిస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం : నోడల్ నర్సరీ ఏర్పాటుకు సిద్దవటం రేంజ్ గొల్లపల్లె బీటులో అటవీ ప్రాంతంలో విత్తనాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మార్చి 21వ తేదీన అంతర్జాతీయ అటవీశాఖ దినోత్సవం రోజు కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ కడప ప్రాంత ఫారెస్టు రెస్టోరేషన్ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. అందులో భాగంగా డీఎఫ్ఓ ఆదేశాల మేరకు నోడల్ నర్సరీని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో సిద్దవటం రేంజ్‌లోని స్థానిక జాతి మొక్కలైన రేవా, ఎర్రచందనం, వెలమ, ముష్టి, కరక్కాయలు, అరె, సార, అడవి తమ్మ, ఒడిసే, కుంకుడు కాయలు, కొండపల్లె బొమ్మలకు ఉపయోగించే తెల్లపొనికి, నీరుద్ది, మునుకుడు, మారెడు, ఎర్రబిక్కి, దినసరప, సండ్ర, సులితడ, గౌటిక వంటి చెట్లకు సంబంధించి విత్తనాలను సేకరిస్తున్నామన్నారు. వీటి విత్తనాలతో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలతో అటవీలో పచ్చదనాన్ని పెంచడానికి ఉపయోగిస్తామన్నారు. అలాగే ప్రజలకు పంపిణీ చేస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఓబులేస్, ఎఫ్‌బీఓలు విశ్వనాథ్, మరికొందరు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ రాధాకృష్ణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, విద్యుత్ వంటి పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రజల సమస్యలపై అధికారులు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు సాగితే మెరుగైన అభివృద్ధిని సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషారాణి, వైస్ ఎంపీపీలు అనుదీప్, తుమ్మల భావన, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీటీసీలు సోమిశెట్టి సునీత, రమేష్ రెడ్డి, సుభాన్ బాషా, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు

రాజంపేట రూరల్ : దాసరి సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక దాసరి సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం రాత్రి సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా ఎనిమినేని వెంకటరమణ వ్యవహరించారు. అధ్యక్షులుగా తుపాకుల ఓబిలేసు, కార్యదర్శిగా గోవిందు గంగాధర, కోశాధికారి కొండేటి రవికుమార్, ఉపాధ్యక్షులు కొండేటి వెంకటేశ్వర్లు, రొండా నాగేశ్వరరావు, ఉప కార్యదర్శులు కొప్పోలు వెంకటసుబ్బయ్య, తుపాకుల సురేష్‌బాబు, ముఖ్య సలహాదారులు గోవింద బాలకృష్ణతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

సిద్దవటం : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతకు వినతి పత్రాన్ని సమర్పించామని వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటపతి మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా వీఆర్ఏల కమిటీ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాన్ని తహసీల్దారుకు అందజేశామన్నారు. జిల్లా, మండల వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకులు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ బరువై అవస్థలు పడుతున్నామన్నారు. పే స్కేలు విధానం అమలుతో పాటు రెవెన్యూ కార్యాలయాల్లో నైట్ డ్యూటీ రద్దు చేసి అర్హులైన వారికి వీఆర్ఓలుగా పదోన్నతి కల్పించాలని, వీఆర్ఏల గోడు పట్టించుకోవాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల మండల అధ్యక్షుడు దేవదాసు, కోశాధికారి అమరావతి, కార్యదర్శి రమణ, విఆర్ఏలు తులసమ్మ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు శశికుమార్ రెడ్డి మృతి


మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం పంచాయతీలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ప్రముఖ కాంట్రాక్టర్ బత్తిన శశికుమార్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి తదితరులు శశికుమార్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఓబులవారిపల్లి మండలం నారావారిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీకి, కార్యకర్తలకు, పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ దానధర్మాలు చేస్తూ అందరి హృదయాల్లో శశికుమార్ రెడ్డి నిలిచిపోయారన్నారు.

పరామర్శ

వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తిన శశికుమార్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న సాక్షి ఎడిటర్ రక్కాసి ధనుంజయరెడ్డి హైదరాబాద్ నుంచి హుటాహుటిన రైల్వేకోడూరుకు వచ్చారు. శశికుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సీహెచ్ రమేష్, తల్లెం భరత్ కుమార్ రెడ్డి, మండల నాగేంద్ర పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని మారావారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన శశికుమార్ (45) మృతి పార్టీకి తీరనిలోటని మండల వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన శశికుమార్ మృతదేహాన్ని నాయకులతో కలసి సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

5 లీటర్ల నాటు సారా స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని వైకోట క్రాస్ వద్ద నాటుసారా తరలిస్తున్న రామచంద్రయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి ఐదు లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరిచారు.

నివాళి


కొండయ్యకు నివాళులు అర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : మండల పరిధి చిట్లూరు గ్రామం కొండావాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొర్రపాటి కొండయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం కొండావాండ్లపల్లెలో కొండయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మురళీ మోహన్‌రెడ్డి, ఆది రెడ్డి, తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సాగు రైతుకు లాభదాయకం

లక్కిరెడ్డిపల్లి : ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాల పంటలు సాగు రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని లక్కిరెడ్డిపల్లి ఏడీఏ జయరాణి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం అధికారుల ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి ఆర్‌బీకే కార్యాలయంలో 30 రకాల నవధాన్యాలతో తయారు చేసిన 400 ప్యాకెట్లను రైతులకు జయరాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాలు 1.050 గ్రాములు వెయ్యి రూపాయలు చొప్పున రైతులకు అందిస్తున్నామని, వీటిని ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. నవధాన్యాల వల్ల భూమి సారవంతం పెరుగుతుందని, అలాగే నేలలో తేమశాతం వృద్ధి చెందుతుందన్నారు. 365 రోజులు భూమిని కప్పి ఉండవచ్చని, నేలలో పోషకాలు, సూక్ష్మ పోషకాలు భూమికి తేమశాతాన్ని అందిస్తాయన్నారు. ముఖ్యంగా మామిడి తోటల్లో పూత నిలవడం లేదని, కావున నవదాన్య విత్తనాలు రైతులు వేయడం వలన పూత, పిందె నిలబడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమేష్ బాబురావు, అగ్రికల్చర్ క్షేత్రస్థాయి సిబ్బంది, మోడల్ మేకర్ సరస్వతీ, అంజనమ్మ, మండల యూనిట్ సభ్యులు గంగిరెడ్డి, చంద్రమోహన్ రఢ్డి, షాహీక్, నాగమణి, లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం పాఠశాల యాజమాన్య కమిటీ, తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చక్రధర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను 60కి పెంచితే ఆదర్శ పాఠశాలగా మార్పు చెందుతుందని, కావున గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారు తెలియజేశారు.

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి


మజ్జిగ పంపిణీ చేస్తున్న జయన్న, ఫర్హాఖానం

పుల్లంపేట : పుల్లంపేట గ్రామ పంచాయతీలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ వేడిమి అధికంగా ఉందని, ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుండుపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయన్న, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఫర్హాఖానం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ సభ్యులు మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలియజేశారు.